సంతోషపడి పోతున్నాడు పాపం! అతని కిప్పుడు క్షణం తీరికలేదు. పిల్లల్ని చూసుకోవాలి. కామాక్షికి కోపం రాకుండా వాళ్ళని సముదాయించి, బట్టలు తొడిగి, పలకా బలపం యిచ్చి బళ్ళోకి పంపాలి. కాలేజీ చదువుల వాళ్ళని వేళకు కాలేజీకి తోలాలి. మధ్య మధ్య మనవరాలిని ముద్దాడాలి. ఇదంతా అయిన వెనుక అదరా బాదరా రెండు మెతుకులు కతికి ఆఫీసుకు పరుగెత్తాలి.

క్షణం నిలబడ్డానికి తీరిక లేని మనిషికి ఆలోచించడానికి అవకాశం ఎక్కడిది? సాయంకాలం బజారు పనులు. యింటా బైట పురమాయించే మరేవయినా పనులు రాత్రి భోజనాల వేళవరకూ వీటితోనే సరిపోతుంది. భోజనం కాగానే నిద్ర.

శాస్త్రి కిప్పుడు ఏ దిగులూ లేదు. జీవితం అతనితో ప్రమేయం లేకుండా దాని దారిని అది నడిచి పోతోంది.

ఎటొచ్చీ ఎప్పుడేనా తాను ఒంటరిగా బ్రతికిననాటి ఆలోచనలు జ్ఞాపకం వొచ్చినపుడు మాత్రం అప్పటి తన తెలివి తక్కువతనానికి జాలిగా నవ్వుకుంటాడు.

ఇప్పుడు రెండో పిల్లకి పెళ్ళి సంబంధాలు వెతుకుతున్నాడు శాస్త్రి. రెండో దానికి పెళ్ళయిపోతే మరి మూడేళ్ళదాకా మిగతావాళ్ళ విషయంలో బాధ పడనవసరం లేదు.

ఒకనా డెప్పుడో శాస్త్రికి కొంచెం ఆలోచించుకోడానికి తీరిక చిక్కినప్పుడు. పన్నెండేళ్ళ వాడు తన పెద్ద కొడుకు. ఆలోచనలు ఏవిధంగా ఉంటాయోనని అతనికి అనుమానం వచ్చింది.

"బహుశా వాడికి నా ఆలోచనలు వచ్చుండవు. వాళ్ళమ్మలాగా వాడు తెలివయిన వాడు" అనుకున్నాడు.

ఆ వెంటనే అతనికి మరో విషయం జ్ఞాపకం వొచ్చింది. పెళ్ళి కాక ముందు అతను విపరీతమయిన ఆలోచనలతో సతమతమయి పోయేవాడు. క్షణం తీరిక లేకుండా ఏవిటేవిటో ఆలోచిస్తూ మనశ్శాంతి లేకుండా చేసుకొనేవాడు. బ్రతుకంతా నిరాశా నిస్పృహలతో నిండినట్లు, దుఃఖమే తప్ప జీవితంలో మరేం లేనట్లూ ఊహించేసి, ఆనందం అంటే భయం వేసేది. ఆడవాళ్ళంటే కలిగిన అసహ్యం వల్ల, మనుషులంటే కలిగిన ద్వేషంవల్ల మనసంతా కలుషితమై పొయ్యేది. తన శక్తి సామర్థ్యాల మీద నమ్మకం లేని మనిషి ఆనందాన్ని అందుకోడానికి ముందుకు రాలేడని అతని కిప్పుడిప్పుడు అర్థమౌతోంది.

కామాక్షితో కాపరం పెట్టాక, అంతకు ముందు కనిపించని ఆనందమంతా కళ్ళ ముందు నిలిచింది. శ్రమెక్కువైనా బాధ్యతలో ఎంతో సంతృప్తి కనిపిస్తోంది. ఒక బాధ్యత సుస్పష్టంగా కంటికగుపిస్తున్నప్పుడు మనిషికి పాత కాపతనం జ్ఞాపకం రాదు. ఏదో విధంగా దాని పూర్తి చేయకోవాలన్న తపన తప్ప మరో ధ్యాసే వుండదు. సంసారాన్ని సాగరంతో ఉపమానించిన పెద్దల అభిప్రాయం ఏమిటో శాస్త్రికి స్పష్టం కాలేదుగాని, అతనికిప్పుడు ప్రపంచ సాగరంలోనే సుఖ సంతోషా లున్నట్టు అనుభవం నేర్పింది.

ఇదంతా నెమరువేసుకున్నప్పుడు శాస్త్రి గర్వంగా రొమ్ము విరుచుకుని, ఓ చిరునవ్వు నవ్వుకున్నాడు